క్లుప్తంగా

నేడు మైనార్టీ రుణాలకు ఇంటర్వ్యూలు

కోస్గి: ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ముస్లిం, మైనార్టీ అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తారని, రాయితీ రుణాల కోసం 2022–23 ఆర్థిక సంవత్సరంలో కెటగిరి–1, కెటగిరి–2 కింద దరఖాస్తు చేసుకున్న ముస్లిం, మైనార్టీలందరికి బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒర్జినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

కళాశాల ప్రహరీ నిర్మించాలి



మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు, మండల ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోయారు. ముఖ్యంగా స్థల ఆక్రమణ జరగడంతో పాటు పశువులు, ఇతరులు యథేచ్ఛగా కళాశాల ప్రాంగణంలోకి వస్తున్నారని, అదే విధంగా ఈ మధ్య కాలంలో మందుబాబుల ఆగడాలు ఎక్కువ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపడుతామని తెలియజేసి, నేటికి ఏళ్లు గడుస్తున్నా.. అది ఆచరణలోకి మాత్రం రావడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కళాశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.


సేవలకు గుర్తింపు పురస్కారాలు



మద్దూరు: ఆయా రంగాల్లో సేవలు చేసిన వారికి ఉగాది పురస్కారాలు అందజేయడం సంతోషకరమని ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ అరుణ అన్నారు. మద్దూరు గ్రామపంచాయతీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈ ఏడాది ఉత్తమ సేవలకు గుర్తింపుగా వ్యవసాయం, విద్యా, వైద్యం, కళా, ఉపాధి, సేవా రంగాల్లో వారికి శాలువా, మెమెంటో, పూలమాలతో సన్మానించారు. వ్యవసాయ రంగంలో కుమ్మరి వెంకటప్ప, విద్యారగంలో మాధవి, వైద్యం రంగంలో ఆశ కార్యకర్త మహేశ్వరీ, ఉపాధి రంగంలో యుద్ధం, సేవా రంగంలో చిన్నమ్మకు ఈ పురస్కారాలు అందజేశారు. గ్రామాలో వయోవృద్ధులైన సిద్రామయ్య, షేక అహ్మద్, బుగిడి నర్సింహులు టీచర్‌కు ఈ పురస్కారాలను అందజేశారు. ప్రతి ఏడాది ఈ ఆరు రంగాలతో పాటు, గ్రామాలనికి మంచి పేరు తీసుకొచ్చిన వారికి కూడా ఈ పురస్కారాలను అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటయ్య, ఉపసర్పంచ్ యాదవరెడ్డి, శివకుమార్, సంజీవ్‌కుమార్, వీరేష్‌గౌడ్, బాల్‌రాజ్, శ్రీశైలం, మల్లీకార్జున్, నర్సింహులు, మహదేవ్, వెంకట్ రాములుగౌడ్, వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

పక్కా నిర్మాణాలపై పేదల దృష్టి

అమరచింత: పట్టణంలోని దుంపాయికుంటలో గల సర్వే నంబర్ 547, 548లో గల పద్నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణాలకు కేటాయించిన స్థలాలు చూపాలని నిర్వహిస్తున్న గుడిసెల పోరు నేటికీ 196 రోజులు పూర్తి చేసుకుంది. సెప్టెంబర్ 6, 2022 నుంచి ప్రారంభమైన గుడిసెల పోరు నేటికీ కొనసాగుతుంది. గతంలో ఇచ్చిన ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చిన అధికారులు వాటికి తగిన స్థలాలు పొజిషన్ చూపాలంటూ లబ్ధిదారులు ఆందోళన నిర్వహిస్తున్నారు. గుడిసెల పోరుకు సీపీఎం మద్దతు ఇవ్వడంతో 430 మంది లబ్ధిదారులు తాత్కాలికంగా గుడిసెలను నిర్మించుకొని అక్కడే జీవిస్తున్నారు. ఒకొక్కరు రూ.10 నుంచి రూ.15 వేలు ఖర్చుచేసి తడికలతో గుడిసెలను నిర్మించుకున్నారు. వారం రోజుల కిందట గాలి, వానకు గుడిసెల తడికలు కూలడంతో ఇక పక్క నిర్మాణాలపై దృష్టి సారిస్తున్నారు. జీఓ నంబర్ 58, 54 ప్రకారం ఎవరైనా ప్రభుత్వ భూమిలో నిరుపేదలు ఇంటి స్థలాల కోసం కబ్జాలో ఉంటారో వారికే అవి చెల్లుతాయన్న ఆదేశాలతో మొక్కవోని ధైర్యంతో లబ్ధిదారులు ఆందోళనలను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుపేద లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



ఊరూరా ఉగాది వేడుకలు

- పొలం పనులకు శ్రీకారం చుట్టిన రైతులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ప్రారంభమైన శోభకృత్ నామ సంవత్సరం

కోస్గి: మండల పరిధిలో తెలుగువారి నూతన సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం ఊరూరా ఘనంగా కొనసాగాయి. పర్వదినం సందర్భంగా ఇళ్లకు మామిడి తోరణాలు కట్టి, షడ్రుచులతో తయారు చేసిన పచ్చడిని పంపిణీ చేస్తూ.. ఒకరికిఒకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పూర్వ కాలం నుంచి వస్తున్న ఆచారంలో భాగంగా ఉగాది రోజున రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఇళ్లలో పిండివంటలు చేసి గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల్లో ప్రారంభమైన శోభకృత్ నామ నూతన సంవత్సరంలో అంతా మంచి జరుగాలని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం..

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీలక్ష్మి వెంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల ప్రాంగాణంలో నూతన సంవత్సరం సందర్భంగా పంచాంగ శ్రవణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైదిక తసోనిధి జ్యోతిష్యరత్న రుద్రాక్షాల మఠం అమరలింగ స్వామి, మఠం అంపయ్య స్వామి వారు ఈ ఏడాది రాజకీయాలు, సామాజిక అంశాలు, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, వ్యాపారం, వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలను పురోహితులు వివరించారు. పేర్ల ఆధారంగా 12 రాశుల వారి ప్రత్యేక ఫలితాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన, చేయకూడని పనులను, ఆదాయ, వ్యయాలను శాస్త్రోక్తంగా వివరించారు. నవ నాయకుల ఫలితాలు, వాటి ప్రభావం తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టణ శివారులోని బీసీ కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో కౌన్సిలర్ తుడుం మంజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాలనీ యువకులు భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. చెన్నారం, బిజ్జారం, హన్మాన్‌పల్లిలో యువకులు పచ్చడి వితరణ చేశారు.

గ్రామాల్లో పంచాంగ శ్రవణం

శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం గ్రామాల్లో ప్రజలు పురోహితుల పంచాంగ శ్రవణాన్ని శ్రద్ధగా విన్నారు. చెన్నారంలోని ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో పురోహితులు పంచాంగం పటిస్తూ రానున్న ఈ ఏడాదిలో ఫలితాలు ఎలా ఉంటాయో వివరించారు. పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో సర్పంచ్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పంచాగ శ్రవణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నూతన తెలుగు సంవత్సరం సందర్భంగా నవ నాయకుల ఫలితాలు, వాటి ప్రభావం తెలియజేశారు. ప్రజలు వారివారి పేర్లపై ఈ ఏడాది ఫలితాలను అడిగి తెలుసుకున్నారు.



పెద్దకడ్మూర్ ఆంజనేయస్వామి ఆలయంలో..

మక్తల్: ఉగాది పర్వదినాన్ని సాంప్రదాయబద్ధంగా ప్రజలు జరుపుకొన్నారు. శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా ఉదయమే తలంటు స్నానాలు చేసుకుని కొత్త దుస్తులు ధరించి ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పడమటి ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి, కుంబేశ్వరాలయం, వాసవీ కన్యకాపరమేశ్వరాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నెరడగంలోని ఈశ్వర దేవాలయంలో..

మాగనూర్: మండలంలోని నెరడగంలోని ఈశ్వర దేవాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో ఉగాది పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురుస్తాయని, ప్రజలంతా సుఖసంతోషాలతో గడుపుతారని అన్నారు. కార్యక్రమంలో నెరడగం సర్పంచ్ అశోక్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, గ్రామస్తులు విద్యాసాగర్, ఈశ్వర్‌యాదవ్, ఆశప్ప, కళాప్ప, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్ గోశాల హనుమాన్ మందిర్‌లో ..

ఊట్కూర్: మండలంలో బుధవారం తెలుగు నూతన సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఊట్కూర్, పెద్దజట్రం, పులిమామిడి, చిన్నపొర్ల, పగిడిమారి తదితర గ్రామాల్లో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పచ్చడి పంపిణీ చేశారు. ఊట్కూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉగాది విశిష్టతను తెలియజేశారు. ఆర్యసమాజం మందిరంలో దేవయజ్ఞం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మేన్ బజార్ కూడలిలో కాషాయ ధ్వజాన్ని ఎగురవేశారు. గోశాల హనుమాన్ మందిర్‌లో వేదపండితులు హరి సర్వోత్తమా చారి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవాణం నిర్వహించారు. సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, ఎంపీటీసీ హన్మంతు, ఆర్యసమాజ్ అధ్యక్షుడు కనకప్ప ఆర్య, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు భీంరాజ్, లక్ష్మారెడ్డి, అడ్వకేట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్దకడ్మూర్ ఆంజనేయస్వామి ఆలయంలో...

నర్వ: తెలుగు రాష్ట్రాల నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన్ని మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నర్వ, లంకాల ఉందేకోడ్, పాథర్చేడ్, రాయికోడ పెద్దకడ్మూర్, బెక్కర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల వద్ద అర్చకులు కొత్త ఏడాదిలో గ్రహరాశులు ఎలా ఉన్నాయనే అంశాలను పంచాగశ్రవణం ద్వారా ప్రజలకు వినిపించారు. అనంతరం తీర్థప్రసాదాలతో పాటు షడ్రుచుల పచ్చడిని అందరికి పంపిణీ చేశారు. రాత్రికి ఆలయాల వద్ద అఖండ భజనలు చేపట్టారు.

మరికల్: మండలంలో ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. బుధవారం సాయంత్రం మరికల్ ఆంజనేయస్వామి ఆలయంలో బ్రాహ్మణులు పంచాగశ్రవణం చేశారు. రాశుల వారీగా, ఆదాయ, నష్టాలపై తదితర అంశాలపై ప్రజలకు పంచాగం చెప్పారు.



పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో పంచాంగం వింటున్న గ్రామస్తులు

దామరగిద్ద: శోభకృత్ నామ ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని హనుమాన్, రామాలయం, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు, వృత్తి పని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు.

కున్సిలో పంచాంగ శ్రవణం..

కృష్ణా: మండల కేంద్రంతో పాటు గుడెబల్లూర్, కున్సి, ఆనంపల్లి తదితర గ్రామాల్లో బుధవారం ఉగాది నూతన సంవత్సరం, శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. కున్సిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేసి భక్తులకు పచ్చడి పంపిణీ చేశారు. గుడెబల్లూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన పంచాంగానికి పూజలు నిర్వహించి ఈ సంవత్సరం ఫలాలను వివరించారు. సర్పంచ్‌లు శంకరమ్మ, గజ్జి మహాదేవమ్మ, రాధమహాదేవ్, లక్ష్మీనారాయణ, రామకృష్ణా, తదితరులు పాల్గొన్నారు.

ధన్వాద: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఉగాది పండుగ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. గున్ముక్లలోని సాయి బాబా దేవాలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అలాగే మంత్రోనిపల్లిలో ఉగాది పచ్చడిని తయారు చేసి గ్రామస్తులందరికీ పంపిణీ చేశారు. ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అశోక్‌గౌడ్, నాగరాజు, శాంతమ్మ, చెన్నయ్య, వెంకటస్వామి, నర్సిములు, రాజు, అంజనేయులు పాల్గొన్నారు.



మక్తల్‌లో పంచాంగ రాశి ఫలాలు చెబుతున్న వేదపండితుడు



మరికల్‌లో..



కున్సిలో ..



మక్తల్‌లో..



నెరడగంలో ..



ఊట్కూర్‌లో ..



మంత్రోనిపల్లిలో ఉగాది పచ్చడి పంపిణీ



గున్ముక్లలో సాయిబాబా దేవాలయంలో ..

విద్యుదాఘాతంతో కాడి ఎద్దు మృతి



పులిమామిడిలో మృతిచెందిన ఎద్దు

ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో విద్యుదాఘాతంతో కాడి ఎద్దు మృతిచెందిన సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పులిమామిడికి చెందిన బి.కృష్ణయ్య రోజూ కాడి ఎద్దులను పశువుల కొట్టంలో కట్టేసేవాడు. బుధవారం ఉదయం కాడెద్దు తాడును తెంచుకుని ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతాల్లో మేతకు వెళ్లింది. అక్కడ విద్యుత్ తీగలు తగిలి మృతిచెందింది. ఉదయం కాడెద్దులకు మేత వేసేందుకు పొలానికి వెళ్లగా ఎద్దు విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం గమనించాడు. ఈ విషయమై రెవెన్యూ విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయగా.. రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించారు. బాధిత రైతుకు రూ.80 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వానరానికి అంత్యక్రియలు..

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామ శివారులో బుధవారం విద్యుత్ తీగలు తగిలి వానరం మృతి చెందింది. గ్రామస్తులు అందరు కలిసి సంప్రదాయ ప్రకారం వానరాన్ని ఊరేగించి అంత్యక్రియలు నిర్వహించారు.



మృతిచెందిన వానరం

డ్రెయినేజీలు అస్తవ్యస్తం



పాత విండో భవనం వద్ద డ్రెయినేజీలను దాటుతున్న కాలనీవాసులు

మరికల్: మండల కేంద్రంలోని గజలమ్మగడ్డలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవస్తంగా మారడంతో సర్పంచ్ మా బాధలు పట్టించుకోండంటూ అక్కడి ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. పక్కనే పెద్ద చెరువు ఉండటంతో దోమలకు నిలయంగా మారింది. పాత సింగిల్‌విండో కార్యాలయం వద్ద కాలనీ నుంచి చెరువులోకి వచ్చే డ్రెయినేజీ మురుగుకు పైపులైన్ వేయకపోవడంతో బాటసారులు, కాలనీ వాసులు మురుగు కాల్వను దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. గజ్జలమ్మగడ్డలో అండర్‌గ్రౌడ్ డ్రెయినేజీలను నిర్మించాలని కాలనీవాసులు వాపోతున్నారు.

జనచైతన్య యాత్రను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతం చేసేందుకు సీపీఎం చేపట్టిన జన చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం మండల అధ్యక్షుడు గోపాల్ తెలియజేశారు. బుధవారం మండలంలోని ఉడ్మల్‌గిద్దలో బస్సు యాత్ర వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను నిరీర్యం చేస్తూ.. ప్రైవేటు వ్యక్తులకు దారదత్తం చేస్తున్నాడని విమర్శించారు. ఈ నెల 27న నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి ప్రకాష్, మల్లేష్, భీంషప్ప, అశోక్, నరసింహ, ఆటో నర్సింహ, వెంకటప్ప, కాశప్ప, కృష్ణ, మల్కప్ప, బాల్‌చందర్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



మాగనూర్: మాగనూర్ ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్)ను బుధవారం మండల కేంద్రంలో అట్టహాసంగా ప్రారంభించారు. మాగనూర్‌కు చెందిన కొందరు యువకుల ఆధ్వర్యంలో మొత్తం 10 జట్లు ఈ టోర్నీలో పాల్గొనగా.. 20 రోజుల పాటు లీగ్‌లు, సెమీస్, ఫైనల్స్ జరగనున్నాయి. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు కృష్ణ మాట్లాడారు. క్రీడల్లో యువత రాణించడమే ప్రధాన లక్ష్యంతో ఈ ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభించామన్నారు. ఇది మొదటి సారిగా నిర్వహిస్తున్న లీగ్ అని పేర్కొన్నారు. అంతకు ముందు గ్రామ పెద్దలు క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వాకిటి శ్రీనివాసులు, వాలి, పల్లె మారెప్ప, ఆంజనేయులు, ఆనంద్‌గౌడ్, చారీ, అశోక్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చిన్నచింతకుంట: రంజాన్ పండగను పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టే 70మంది ముస్లింలకు మండల కేంద్రంలోని మదీనా మసీదు వద్ద మెర్సీ ఫర్ ఆల్ ట్రస్ట్ సభ్యులు ఫక్రుద్దీన్ అలీ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫక్రుద్దీన్ అలీ మాట్లాడుతూ రంజాన్ ఉపవాస దీక్షలు నెలరోజుల పాటు ముస్లింలు నిష్టతో చేపడుతారన్నారు. అందుకు పేద ముస్లింలకు ఇబ్బందులు కలుగకుండా నిత్యావసర సరుకులను అందించడం జరిగిందన్నారు. రఫీఉద్దీన్, జహంగీర్, పాష పాల్గొన్నారు.

భక్తుల జడకొప్పలాట..



దోరేపల్లిలో ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో జడకొప్పలాట ఆడుతున్న భక్తులు

మద్దూరు: శోభకృత్‌నామ తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని మండలంలో ఉగాది పండుగను ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజలు దేవాలయాలకు వెళ్లి పండుగ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంలో కోట్ల ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో రాఘవేంద్రచారీ పంచాంగ శ్రవణం చేశారు. ఏయే పేర్లపై, ఏ కార్తెలో రైతుల ఏ మేలు జరుగుతుందో వివరించారు. కోట్ల ఆంజనేయస్వామి అలయ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని పంచారు. అనంతరం సచివాలయం వద్ద ఆనవాయితీ ప్రకారం సర్పంచ్ అరుణతో పాటు ఎంపీపీ విజయలక్ష్మి ప్రతి ఒక్కకుటుంబానికి ఆకువక్క పంచారు. నిడ్జింత గ్రామశివారులోని తిరుమలేషుని ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని అలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. మండలంలోని దోరేపల్లి ఆంజనేయ స్వామి దేవాలయం ఎదుట జడకొప్పులాట నిర్వహించారు. మండలంలోని రెనివట్ల, నిడ్జింత, పల్లెర్ల, దమగాన్‌పూర్, ఖాజీప్, కొత్తపల్లి, తదితర గ్రామాల్లో పండుగను, పంచాగ శ్రవణం చేశారు. ఎంపీటీసీ వెంకటయ్య గ్రామస్తులు సిద్రామయ్య, రాములుగౌడ్, వీరేష్‌ఘాడ్, బాబుస్వామి, శివకుమార్, వెంకట్‌రాములుగౌడ్, శివరాజ్, కన్నప్ప, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్రెమ్మ దేవాలయ నిర్మాణానికి పూజలు

మక్తల్: మండలంలోని కర్రెమ్మ దేవాలయ నూతన నిర్మాణానికి పీఠాధిపతి సిద్ధలింగేశ్వర స్వామి చేతుల మీద భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామంలో ఆలయాలు నిర్మాణం చేయడం అదృష్టంగా భావిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, నర్సింహులు, నర్సింహ, గజలప్ప, శంకర్, సందప్ప, దాసరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న పీఠాధిపతి సిద్ధిలింగేశ్వర స్వామి

గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ

నర్వ: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నూతన పంచాయతీలకు భవనాలు మంజూరు చేయడంతో బుధవారం లక్కర్‌దొడ్డిలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివన్న, ఉప సర్పంచ్ రాధిక గ్రామ పెద్దలు భూమి పూజ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కృషితో కొత్త పంచాయతీగా ఏర్పడిన మా గ్రామానికి రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి కొత్తపంచాయతీలో పాలన ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఉగాది పర్వదినం రోజు ఈ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గోవిందు రెడ్డి, గొల్లశ్రీను, రవి, రాములు, చిన్న మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



లక్కర్‌దొడ్డిలో భవనానికి భూమిపూజ చేస్తున్న నాయకులు